సాక్షి ఖమ్మం

గురువారం : 23 : జనవరి : 2025



ఆయిల్‌ఫెడ్‌లో ఆఫ్‌టైపే ఎక్కువ

ఆయిల్‌ఫెడ్ సరఫరా చేసే ఆయిల్‌పామ్ మొక్కల్లో నాణ్యత లేక రైతులు నష్టపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. 8లో



క్రికెట్ టోర్నీ ఆరంభం

అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ఖమ్మంలోని సర్దార్ స్టేడియంలో బుధవారం ప్రారంభమైంది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 16°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం, రాత్రి చలిగాలుల తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం



గొలుసు, చెవిదిద్దులు తీసి ఇస్తున్న విద్యార్థిని



కేంద్రంలోకి వెళ్లేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు



పరీక్ష రాశాక తల్లిని ఆలింగనం చేసుకున్న విద్యార్థిని

ఖమ్మం సహకారనగర్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా ఉదయం సెషన్‌కు 771మంది విద్యార్థుల్లో 753మంది, మధ్యాహ్నం పరీక్షకు 759మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. కేంద్రాల వద్ద సిబ్బంది హాల్‌టికెట్లతో పాటు ఇతర గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే విద్యార్థులను అనుమతించారు. కాగా, బంగారు ఆభరణాలు ధరించి రావొద్దని ముందుగానే సూచించినా పలువురికి అవగాహన లేక అలాగే వచ్చారు. దీంతో నిర్వాహకుల సూచనలతో అప్పటికప్పుడు బంగారు గొలుసులు, బ్రాస్‌లెట్లు, చెవిదిద్దులను తీసి తల్లిదండ్రులకు ఇవ్వడం కనిపించింది.

– ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటల నుంచి తిరుమలాయపాలెం మండలంలోని కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, జల్లేపల్లి, హైదర్‌సాయిపేట, పడమటి తండాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే, మధ్యాహ్నం 12-30గంటలకు జోగులపాడులో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, ఆతర్వాత చంద్రు తండా, మహ్మదాపురంలోనూ సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

దివ్యాంగులకు స్వయంగా ఉపాధి పథకాలు

ఖమ్మం వన్‌టౌన్: దివ్యాంగులు స్వయం ఉపాధి పథకాలకు రుణాల కోసం ఫిబ్రవరి 2వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని ప్రతీ మండలం, కార్పొరేషన్‌కు ఒక యూనిట్ చొప్పున రూ.50 వేల విలువైన 24 యూనిట్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు www.tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 40 శాతం అంగవైకల్యం, 21 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగి, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వార్షికాదాయం ఉన్న వారు అర్హులని తెలిపారు. గతంలో ఎలాంటి రుణం తీసుకోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


1.97 లక్షల ఎకరాల్లో రబీ సాగు



రైతు సందేహాలు నివృత్తి చేస్తున్న డీఏఓ పుల్లయ్య

కామేపల్లి: ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 1.97 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. కామేపల్లి రైతువేదికలో బుధవారం ఆయన సస్యరక్షణ చర్యలు, రైతుభరోసా సర్వేపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ వరి 1.17 లక్షల ఎకరాలతో పాటు మొక్కజొన్న 76,395, పెసర 2వేలతో పాటు ఇతర పంటలను రైతులు సాగు చేశారని వెల్లడించారు. రైతులకు కావాల్సినంత మేర యూరియా అందుబాటులో ఉన్నందున ఆందోళన అవసరం లేదని తెలిపారు. కాగా, జిల్లాలో ఇప్పటికే 6,400 ఎకరాలకు పైగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించామని, సర్వే పూర్తయ్యాక రైతుభరోసా ద్వారా సాయం అందే భూమి వివరాలు తేలుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ శ్రీకన్య తదితరులు పాల్గొన్నారు.

పీఎల్‌ఐ ఏజెంట్ల నియామకం



ఖమ్మంగాంధీచౌక్: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(పీఎల్‌ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(ఆర్‌పీఎల్‌ఐ) ఏజెంట్లను నియమించనున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. 18 ఏళ్లు నిండి పదో తరగతి అర్హత కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 4వ తేదీలోగా ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి చేరేలా దరఖాస్తులు పంపించాలని సూచించారు. ఫిబ్రవరి 14న నిర్వహించే ఇంటర్వ్యూల ఆధారంగా ఏజెంట్ల ఎంపిక ఉంటుందని తెలిపారు.

రెండో రోజూ.. అదే తీరు

రెండో రోజు అందిన దరఖాస్తులు	మొత్తం సభలు	ఇందిరమ్మ ఇళ్లు	రేషన్‌కార్డులు	రైతు భరోసా	ఆత్మీయ భరోసా	మొత్తం
	204	18,777	17,962	2,147	13,943	52,829

అరుపులు, కేకల నడుమే గ్రామసభలు

- జాబితాలపై పలుచోట్ల ప్రజల నిలదీత
- సభలు మధ్యలో నిలిపివేసేందుకు అధికారుల యత్నం



కొణిజర్ల మండలం సిద్దిక్‌నగర్‌లో గ్రామస్తులు కూలదోసిన టెంట్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా వెల్లడికి నిర్వహిస్తున్న గ్రామ, వార్డుసభలు రెండో రోజైన బుధవారం కూడా నిరసనల నడుమే కొనసాగాయి. అర్హులను జాబితాలో చేర్చలేదని, సర్వే చేసినప్పుడు అర్హులను ఎందుకు గుర్తించలేదంటూ పలుచోట్ల స్థానికులు అధికారులను నిలదీశారు. కొన్నిచోట్ల అరుపులు, కేకల మధ్యే సభలు నిర్వహించారు. రఘునాథపాలెం, కూసుమంచిల్లో అధికారులు గ్రామసభ నుంచి మధ్యలో వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ప్రజలు అడ్డుకున్నారు. జాబితాల్లో అనర్హుల పేర్లు చేర్చారని స్థానికులు నిలదీయగా మరోమారు దరఖాస్తు చేసుకోవాలన్న సూచనతో బారులు దీరి సమర్పించారు. దీంతో లబ్ధిదారుల ప్రకటన సభలు కాస్త దరఖాస్తుల స్వీకరణ సభలుగా మారాయి.

ఎక్కడెక్కడ ఎలా...

- రఘునాథపాలెంలో అర్హులకు ఇళ్లు అందడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వెళ్లేందుకు యత్నించగా అడ్డుకున్నారు.
- కూసుమంచి గ్రామసభలో అర్హులను గుర్తించలేదని అనర్హులకు చోటు కల్పించారని ప్రజలు నిరసన తెలిపారు. ఇక్కడ అధికారులు సభను నిలిపివేసేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకోవడంతో నిరసనల నడుమే కొనసాగించారు.
- నేలకొండపల్లి మండలం మంగాపురం తండాలోనూ సభ అరుపులు కేకలతో దద్దరిల్లింది. పేర్లు జాబితాలో లేవని కొందరు నిలదీశారు.
- తిరుమలాయపాలెం మండలంలోని జల్లేపల్లిలో అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు.
- వైరా మండలంలోని రెబ్బవరంలో వెయ్యి మంది ఉపాధి హామీ పనులకు వెళ్తే కేవలం 160 మందిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. నాలుగు సంక్షేమ పథకాల జాబితాలో కాంగ్రెస్ అనుయాయుల పేర్లే ఉన్నాయని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు నిలదీశారు.
- బోనకల్ మండలం గోవిందాపురంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో 27మంది పేర్లు రాగా.. గుడిసెల్లో ఉండే వారిని కాకుండా ఇళ్లు ఉన్న వారిని ఎంపిక చేశారని, ఆత్మీయ భరోసాలోనూ అనర్హులకు చోటు కల్పించారంటూ గ్రామస్తులు ధ్వజమెత్తారు.
- కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు పంచాయతీ సిద్దిక్‌నగర్‌లో లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగలేదని గ్రామస్తులు సభ టెంట్ కూల్చి అధికారులు వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రోజారాణి, ఎస్సై సూరజ్ వెళ్లి వారికి సర్దిచెప్పాక మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు.
- ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురం గ్రామసభ గందరగోళంగా మారింది. అనర్హులను జాబితాలో చేర్చారని కొందరు నిరసన తెలిపారు.
- చింతకాని మండలం మత్కేపల్లిలోనూ గ్రామస్తులు అధికారులను నిలదీశారు.
- అనర్హులకు పథకాలు మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తూ కల్లూరు మండలం కొర్లగూడెం వద్ద ఆర్డీఓ కారును ప్రజలు అడ్డగించారు.

ఇందిరమ్మ కమిటీ సభ్యులపై దాడి



కోమట్లగూడెంలో ఘర్షణ పడుతున్న స్థానికులు

కారేపల్లి: కారేపల్లి మండలం మండలం కోమట్లగూడెం సభలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాపా చంద్రశేఖర్, వెంపటి రాంబాబు కావాలనే తమ వారికి ఇందిరమ్మ ఇళ్లు రాకుండా చేశారంటూ కాంగ్రెస్ నాయకులు ఈసాల వెంకన్న, గ్రామస్తులు నిలదీశారు. అంతేకాక వేదికపై ఎందుకు కూర్చున్నావని చంద్రశేఖర్‌ను నిలదీసే క్రమాన మండల ప్రత్యేకాధికారి డీసీఓ జి.గంగాధర్, ఎంపీడీఓ సురేందర్ సర్దిచెప్పారు. ఆతర్వాత మాటామాట పెరగడంతో స్టేజీపై కూర్చున్న చంద్రశేఖర్‌ను వెంకన్న నిలదీస్తుండగా ఘర్షణ జరిగింది. ఇదే మండలం రేలకాయలపల్లి, మాణిక్యారం, సీతారాంపురం, ఎర్రబోడు గ్రామసభల్లోనూ అనర్హుల పేర్లు జాబితాలో చేర్చారని, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇళ్లు మంజూరు చేయలేదని ఆందోళనకు దిగారు. సీతారాంపురంలో ఇళ్ల కోసం 579మంది పేర్లు చదువుతుండగా ఎంపికైన వారి పేర్లే చెప్పాలని నిలదీశారు. అయితే, గ్రామంలో 600ఇళ్లకు 579 మంది దరఖాస్తు చేసుకోవడంతో సర్వే చేశామంటూ అనర్హులు ఉంటే చెప్పాలని తహసీల్దార్ సంపత్‌కుమార్ సూచించడంతో తమలో తమకు తగవు పెటొద్దని పేర్కొన్నారు. దీంతో అభ్యంతరాలు వెల్లువెత్తడంతో తహసీల్దార్ వెళ్లిపోయారు. కాగా, కోమట్లగూడెంలో చంద్రశేఖర్‌పై దాడి చేసిన వెంకన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటింటికీ సోలార్ విద్యుత్

బోనకల్ మండలవ్యాప్తంగా అమలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్

బోనకల్: మండలంలోని ప్రతీ గ్రామంలో గృహ విద్యుత్ వినియోగదారులకు పీఎం సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ విద్యుత్ సదుపాయం సమకూర్చనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలో నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సర్వే చేపడుతుండగా, బోనకల్ మండలంలోని అన్ని గ్రామాల్లో అమలుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈనేపథ్యాన స్థానిక రైతువేదికలో బుధవారం రాత్రి గ్రామస్తులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించడంలో భాగంగా గడపగడపకు సర్వే చేస్తామని, ఇళ్లకు వచ్చే సిబ్బందికి ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో పాటు కరెంటు బిల్లులు అందించాలని కోరారు. మండలంలో తొలుత ముష్టికుంట్లలో గురువారం నుండి సర్వే ప్రారంభమవుతుందని ఎస్ఈ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఏఓ శ్రీధర్, డీఈ బి.శ్రీనివాసరావు, ఏడీ పి.కిరణ్‌కుమార్, ఏఈ టి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో పాత నిర్మాణాలు కూల్చివేత

- అధునాతన మిర్చి యార్డు నిర్మాణానికి శ్రీకారం
- త్వరలోనే రూ.155 కోట్ల పనులకు శంకుస్థాపన



మిర్చి యార్డులో తొలగించిన షెడ్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అధునాతన మిర్చి యార్డు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలోనే ఖమ్మం మార్కెట్‌లో అత్యధికంగా మిర్చి క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అయితే, సీజన్‌లో లక్షన్నర బస్తాల వరకు వస్తుండగా స్థలాభావంతో ఇక్కట్లు ఎదురవుతుండడాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఆధునిక యార్డు నిర్మాణానికి అనుమతులు జారీ చేసింది. ఆరు షెడ్లు, మధ్యలో కార్యాలయం(ఆన్‌లైన్ బిడ్డింగ్), కోల్డ్ స్టోరేజీ, చిల్లీ ప్రాసెసింగ్ యూనిట్ తదితర నిర్మాణాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో రూ.155 కోట్లు మంజూరయ్యాయి. మార్కెట్‌లోని మిర్చి యార్డు, అపరాల యార్డు, చైర్మన్, కార్యదర్శి చాంబర్లు తొలగించిన ఆ స్థానంలో అన్ని హంగులతో విశాలమైన యార్డులు నిర్మించనున్నారు. ఈనేపథ్యాన పాత నిర్మాణాల కూల్చివేత పనులు బుధవారం మొదలుపెట్టారు. ఏడు షెడ్లకు సంబంధించి పైకప్పు తొలగింపు పూర్తి చేయగా, మిర్చి క్రయవిక్రయాలను అపరాల యార్డులో చేపడుతున్నారు. సీజన్ జోరందుకుంటే పత్తి యార్డును కూడా వినియోగించుకోవాలని నిర్ణయించారు.

29తర్వాత శంకుస్థాపన

అధునాతన మార్కెట్‌యార్డు నిర్మాణ పనులకు ఈ నెల 29న తర్వాత శంకుస్థాపన చేసే అవకాశముంది. ఇప్పటికే అజిలిజీ సంస్థ ఆధ్వర్యాన డిజైన్లు కూడా రూపొందించారు. పనులకు శంకుస్థాపన చేసిన రోజునే మార్కెట్ కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం కూడా ఉంటుందని సమాచారం. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఇతర మంత్రులు హాజరయ్యే అవకాశముంది.

అర్హుల ఎంపికకే గ్రామసభలు

- ప్రతిపక్షాల నాయకులు చెప్పే మాటలు నమ్మి మోసపోకండి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

నేలకొండపల్లి: ప్రభుత్వం ఈనెల 26న నుంచి ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలు అర్హులందరికీ దక్కుతాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో అర్హులను గుర్తించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మోటాపురం, కోరట్లగూడెం, కోనాయిగూడెం, పైనంపల్లి, అప్పలనరసింహాపురం, కొంగర, కట్టుకాచారం, బుద్ధారంలో బుధవారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సభల్లో మంత్రి మాట్లాడుతూ అర్హులను ఎంపిక చేసేందుకే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబితాలో పేర్లు లేని వారు అధైర్యపడవద్దని, మరోమారు దరఖాస్తులు స్వీకరించి అర్హత ఉంటే పథకాలు మంజూరు చేస్తామని చెప్పారు. అయితే, కొన్నిచోట్ల రెచ్చగొట్టే మాటలతో సభలకు ఆటంకం కలిగిస్తున్న వారిని నమ్మొద్దని సూచించారు. గత ప్రభుత్వం ఏనాడు కూడా గ్రామసభలు నిర్వహించలేదని.. తమ ప్రభుత్వం ఏ పైరవీ లేకుండా పథకాలు మంజూరు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆర్‌డీఓ నరసింహారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు స్వర్ణకుమారి, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బొడ్డు బొందయ్య, రావెళ్ల కృష్ణారావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, పెంటమళ్ల పుల్లమ్మ, పాకనాటి సంగీత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల లబ్ధి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వార్డుసభలో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం అమలుచేసే నాలుగు సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ దక్కేలా పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. ఖమ్మం 28వ డివిజన్ ప్రకాశ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన వార్డు సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశాక ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ప్రాథమికంగా జాబితాలో అర్హుల పేర్లు లేకపోతే మరోమారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జెల లక్ష్మి వెంకన్న, మునిసిపల్ ఏఈ బాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో నమ్మకం

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందిస్తూ వారిలో నమ్మకాన్ని పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి తనిఖీ చేసిన ఆయన చికిత్స కోసం వచ్చిన వారు, సహాయకులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. వాహనాల పార్కింగ్, ఆస్పత్రి ప్రధాన గేట్ వద్ద రద్దీ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, సౌకర్యాలపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఆస్పత్రి నుంచి మెడికల్ కళాశాలకు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓలు రాథోడ్, బి.కిరణ్‌కుమార్‌తో పాటు నర్సింగ్ సూపరింటెండెంట్ జి.పార్వతమ్మ పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని బుధవారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్ల ఏర్పాటుపై సూచనలు చేశారు. విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు ఇచ్చేలా జాబితా రూపొందించాలని, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పేర్లు కూడా చేర్చాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీఓ నర్సింహారావు, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో రాగి జావ పంపిణీ

జిల్లాలో 6వేల మంది విద్యార్థులకు లబ్ధి



వైరాలో విద్యార్థులకు జావ అందజేస్తున్న ప్రిన్సిపాల్ నవీనజ్యోతి, అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్/వైరా: విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ శాతం తగ్గుతుండడంతో జూనియర్ కళాశాలల్లో రాగి జావ పంపిణీకి ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈనేపథ్యాన జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 6వేల మంది విద్యార్థులకు ఉదయం వేళ 250 మి.లీ. చొప్పున జావ అందజేయనున్నారు. ఇందుకోసం అవసరమైన రూ.4లక్షలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విడుదల చేశారని డీఐఈఓ కె.రవిబాబు తెలిపారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారా, లేనిపక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యార్థులకు జావ సమకూర్చేలా సామగ్రిని కళాశాలలకు పంపించినట్లు ఆయన వెల్లడించారు. కాగా, వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాగి జావ పంపిణీని బుధవారం ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి ప్రారంభించారు. వార్షిక పరీక్షలు మొదలయ్యే వరకు జావ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హులందరికీ పథకాలు



వార్డుసభలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా: అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అమలుచేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు అందుతాయని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. ఈ విషయంలో ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరం గ్రామంలో బుధవారం ఆమె వార్డుసభను పరిశీలించి మాట్లాడారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ చింతా వేణు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టు ఎంపికకు 26న పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: సీనియర్స్ విభాగంలో పురుషుల జిల్లా కబడ్డీ జట్టు ఎంపికకు ఈనెల 26న పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కె.క్రిస్టోఫర్ బాబు తెలిపారు. వయో పరిమితి లేకుండా 85కేజీల్లోపు బరువు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డుతో 26న ఉదయం 10గంటలకల్లా సర్దార్ పటేల్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జట్టు ఫిబ్రవరి 1నుంచి ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని, వివరాలకు 98669 86160 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అడసర్లపాడులో డీసీసీబీ బ్రాంచ్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) వేంసూరు మండలం అడసర్లపాడు గ్రామంలో నూతన బ్రాంచ్ ఏర్పాటుచేయనుంది. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడసర్లపాడులో పర్యటించిన అక్కడి రైతులు డీసీసీబీ బ్రాంచ్ ఆవశ్యకతపై విన్నవించారు. దీంతో ఆయన డీసీసీబీ పాలకవర్గం ద్వారా ఆర్బీఐ, నాబార్డ్‌కు ప్రతిపాదనలు పంపించడంతో బ్రాంచ్ మంజూరైంది. ఖమ్మం డీసీసీబీ పరిధిలో ప్రస్తుతం 50 బ్రాంచ్‌లు ఉండగా అడసర్లపాడుతో 51కి చేరనుండగా త్వరలో మరో నాలుగు బ్రాంచ్‌లు కూడా ఏర్పాటుకానున్నాయని బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇందిరా డెయిరీ ఏర్పాటు ఎలా?

- వివరాలు ఆరా తీసిన వరంగల్, హనుమకొండ అధికారులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మధిర: మధిర నియోజకవర్గంలో ఏర్పాటుచేయనున్న ఇందిరా మహిళా డెయిరీ వివరాలు తెలుసుకునేందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులు బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులు సుధీర్, దాస్, అనిల్‌కుమార్, శ్రీకాంత్, సరిత, గీతారాణి, సురేష్ తదితరులు మధిర మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా డెయిరీ అధికారులతో సమావేశమయ్యారు. ఈమేరకు ఖమ్మం అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్, ఇందిరా డెయిరీ ఏపీఎం జె.లక్ష్మణరావు, మధిర ఏపీఎం ఎం.శ్రీనివాసరావు, డెయిరీ అధ్యక్షురాలు కంటెపూడి అన్నపూర్ణ తదితరులు వారికి డెయిరీ ఏర్పాటుకు చేస్తున్న సన్నాహాలు, డెయిరీలో సభ్యత్వం, వాటాధనం సేకరణ తదితర అంశాలను వివరించారు. మధిర ఎంఎంఎస్ అధ్యక్షురాలు కృష్ణవేణి, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి కోసం సెల్‌టవర్ ఎక్కి నిరసన

చింతకాని: మండలంలోని నాగిలిగొండకు చెందిన పామర్తి శ్రీను బుధవారం సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఇప్పటికే పలుమార్లు ఆందోళన చేపట్టగా మరోమారు టవర్ ఎక్కడం గమనార్హం. పామర్తి శ్రీను భార్య లక్ష్మీతిరుపతమ్మ పేరిట 2008లో మంజూరైన ఇందిరమ్మ ఇల్లును ఇదే పేరుతో ఉన్న వ్యక్తి భార్య కళావతికి కేటాయించారు. దీంతో శ్రీను దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే అధికారులు నిరాకరించారు. ఆపై ఎక్కడకు వెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో దీంతో ఈనెల 9వ తేదీన సెల్ టవర్ ఎక్కి నిరసన తెలపగా మళ్లీ ఇప్పుడు గ్రామసభల్లో ప్రదర్శించిన జాబితాలోనూ పేరు లేక టవర్ ఎక్కాడు. ఆయన టవర్ పైభాగాన ఉండడంతో ఈమేరకు ఎస్సై నాగుల్‌మీరా, తహసీల్దార్, ఎంపీడీఓ రామయ్య చేరుకుని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని నచ్చచెప్పడంతో నాలుగున్నర గంటల తర్వాత శ్రీను టవర్ దిగొచ్చాడు. ఈ మేరకు గ్రామంలో ఉద్రిక్తత నెలకొనగా ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాన్ని కూడా సిద్ధం చేసినప్పటికీ శ్రీను దిగి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

ఆయిల్‌ఫెడ్‌లో ఆఫ్‌టైపే ఎక్కువ

- ప్రైవేట్ కంపెనీల ద్వారా నాణ్యమైన మొక్కలు
- అటే మొగ్గుచూపుతున్న ఆయిల్‌పామ్ రైతులు
- ఫలితంగా నర్సరీలు దాటని 40 లక్షల మొక్కలు
- రేగళ్లపాడు ఘటనలో ఇద్దరు చిరుద్యోగులపై వేటు



సత్తుపల్లి మండలం నారాయణపురంలో నాటాక మూడేళ్లు దాటినా గెలలు వేయని ఆయిల్‌పామ్ చెట్టు (ఫైల్)

సత్తుపల్లి: ఆయిల్‌పామ్ సాగుచేస్తే దీర్ఘకాలం ఆదాయం వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మొక్కకు ఏటా రూ.3వేల చొప్పున ఎకరాలో 57 మొక్కలకు రూ.1.71 లక్షలు ఆదాయం సమకూరుతుంది. తోట జీవితకాలం 30 ఏళ్లు కావడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ వారి ఆసక్తి తగినట్లుగా నాణ్యమై మొక్కలు సరఫరా చేయడంలో ఆయిల్‌ఫెడ్ విఫలమవుతుందనే విమర్శలు వస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ, పర్యవేక్షణ, రైతుకు సబ్సిడీ సరఫరా ఉద్యానవన శాఖ పర్యవేక్షణలోనే ఉండేది. ఆయిల్‌ఫెడ్ చేతిలోకి వెళ్లాక ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

అప్పట్లో కొరత...

అయిల్‌పామ్ తోటలు పెంపకానికి రైతులు ఏడాది క్రితం వరకు పెద్ద ఎత్తున ముందుకు రావడంతో మొక్కలు దొరకని పరిస్థితి ఉండేది. ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి మొక్కలను తరలిస్తే అప్పుడు పెద్ద నేరంగా పరిగణించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా మారింది. రాష్ట్రంలోని పలుచోట్ల నర్సరీల్లో సిరాడ్, తంబా, యాగంబి, స్ప్రింగ్ రకం పిలకలను పెంచుతుండగా.. ఎనిమిది నర్సరీల్లో సుమారు 40 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నా రైతులు ముందుకు రావడం లేదు. అయిల్‌ఫెడ్ సంస్థ సరఫరా చేస్తున్న మొక్కల్లో ఆఫ్‌టైప్(నాటడానికి పనికిరానివి, కాత రానివి) ఎక్కువగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది.

ప్రైవేట్ భాగస్వామ్యంలో..

గోద్రేజ్ ప్రైవేట్ కంపెనీకు చెందిన ఎఫ్‌జీవీ సీడ్‌లింగ్స్(పిలక మొక్కలు) నాటితే 95శాతం బతుకుతున్నాయని చెబుతున్నారు. సదరు కంపెనీ విత్తనాల ఎంపిక, మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తుండడంతో ఆఫ్‌టైప్ ఫిర్యాదులు పెద్దగా రాలేదు. గోద్రేజ్ కంపెనీ భద్రాద్రి జిల్లాలోని చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, రఘునాధపాలెం, కొణిజర్ల, తిరుమలాయపాలెం మండలాల్లో రైతులకు మొక్కలు అందిస్తోంది. ఎకరాకు నాలుగైదు మొక్కలు మినహా పెద్దగా ఆఫ్‌టైప్ రాకపోవడం, దిగుబడి కూడా బాగుండడంతో రైతులు అటే మొగ్గు చూపుతున్నారు. మిగతా మండలాల్లోనూ ఇలాంటి మొక్కలే సరఫరా చేయాలనే డిమాండ్ వస్తోంది.

పనికి రానివి నాలుగు లక్షలు...

రేగళ్లపాడు ఆయిల్‌పామ్ నర్సరీకి కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న తెంబా రకం మొక్కలు మూడు లక్షల మేర ఆఫ్‌టైప్‌గా తేలిన విషయం విదితమే. అయితే, 2022లో ఇండోనేషియా దేశం నుంచి దిగుమతి చేసుకున్న యాగంబి రకం లక్ష మొక్కలు కూడా పనికిరావన్నవిషయం బయటపడడం గమనార్హం. దీంతో రూ.3కోట్ల నుంచి రూ.4 కోట్ల మేర ఆయిల్‌ఫెడ్‌కు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు అంచనా. కాగా, ఈ విషయం బయటపడ్డాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైన రేగళ్లపాడు నర్సరీ ఇన్‌చార్జ్ పృథ్వీలాల్, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణారావును సస్పెండ్ చేస్తూ ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగబాబు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే, అసలు బాధ్యులెవరో తేల్చకుండా, చిరుద్యోగులపై వేటు వేయడం విమర్శలకు తావిస్తోంది.

మంత్రి తుమ్మల జోక్యం చేసుకోవాలి..

రైతులకు ఆయిల్‌ఫెడ్ ద్వారా నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలు అందించేలా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకోవాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ రైతుల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య కోరారు. సత్తుపల్లిలోని ఆయిల్‌ఫెడ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రేగళ్లపాడు నర్సరీ ద్వారా మొక్కలు తీసుకుని నాటిన రైతుల తోటల్లో శాస్త్రవేత్తలతో అధ్యయనం చేయించాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడమేకాక ఆయిల్‌ఫెడ్ నుంచి రిటైర్డ్ ఉద్యోగులను బయటకు పంపించలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చెలికాని సూరిబాబు, ఆళ్ల నాగబాబు, రావుల రాజబాబు, పుచ్చకాలయ సోమిరెడ్డి, దొడ్డా చక్రధర్ రెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీళ్లు లేక నోళ్లు తెరుస్తున్న పొలాలు

వారబందీ విధానం ఎత్తివేయాలని డిమాండ్



అన్నారుగూడెంలో నెర్రెలు బారుతున్న పొలం

తల్లాడ: సాగర్ జలాశయంలో నిండా నీరు ఉండి కూడా పంటలకు అందకపోవడంతో వరి సాగుచేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. తల్లాడ మండలం సిరిపురం మేజర్ కాల్వ కింద పలువురు రైతులు వెదజల్లే పద్ధతిలో వరిసాగు మొదలుపెట్టారు. అయితే, వారబందీ విధానంలో కాల్వకు నీరు విడుదల చేస్తుండడంతో అందరి పొలాలకు అందడం లేదు. ఈనేపథ్యాన సిరిపురం మేజర్ పరిధి అన్నారుగూడెం, బిల్లుపాడు, వెంకటగిరి, మల్లవరం, లక్ష్మీనగర్, గోపాలపేట, తల్లాడ, తెలగవరం, రేజర్లల్లో పైర్లు ఎండిపోయే పరిస్థితి ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. ఈమేరకు వారబందీ విధానాన్ని తొలగించి నిరంతరాయంగా నీరు అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై బుధవారం తల్లాడలో ఎన్నెస్పీడీఈ కార్యాలయం వద్ద పలువురు రైతులు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం డీఈఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేయగా నాయకులు నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణం కృష్ణయ్య, సాయిన్ని ప్రకాశరావు, అయినాల రామలింగేశ్వర్‌రావు, పులి కృష్ణయ్య, అనుమోలు కృష్ణయ్య, కర్లకంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



యరమల కోటారెడ్డి

మధిర: మండలంలోని మర్లపాడు జెడ్పీహెచ్ఎస్ సైన్స్ ఉపాధ్యాయుడు యరమల కోటారెడ్డికి డాక్టరేట్ లభించింది. 'తెలుగు సాహిత్యంలో చావా శివకోటి కథలు – సమగ్ర పరిశీలన' అంశంపై ఆచార్య నారిశెట్టి వెంకటకృష్ణారావు పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఏపీలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల హెచ్ఎం పెన్మత్స భీమరాజు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం అభినందించారు. కాగా, కోటారెడ్డి సతీమణి డాక్టర్ శీలం ఇందిర మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

గొలుసుకట్టు స్కీం పేరుతో వసూళ్లు

రఘునాథపాలెం: ఒకసారి రూ.2,500 చెల్లించి మరికొందరిని చేర్పిస్తే ఎనిమిది నెలల పాటు రూ.వెయ్యి చొప్పున సరుకులు అందించడమే కాక ప్రతీనెల రూ.వేయి ఇస్తామని నమ్మబలికి గొలుసుకట్టు స్కీం పేరుతో వసూళ్లకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ సందర్భంగా బుధవారం రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిమ్మపుడి, కోయచలక తదితర గ్రామాల్లో 39 మంది నుంచి రూ.2,500 చొప్పున వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదు అందడంతో వరంగల్‌కు చెందిన లక్ష్మయ్యతో పాటు చిమ్మపుడి, ఖానాపురానికి చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశారు. కాగా, గొలుసుకట్టు సంస్థ ప్రధాన కార్యాలయం వనపర్తిలో, ప్రాంతీయ కార్యాలయం వరంగల్‌లో ఉండగా ఖమ్మంలోనూ కార్యాలయం తెరిచారా, ఇందులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేఎంసీ బిల్‌కలెక్టర్లకు షోకాజ్ నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆస్తి పన్ను వసూళ్లల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బిల్‌కలెక్టర్లుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ బుధవారం నోటీసులు జారీ చేశారు. రోజువారీ పన్నుల వసూళ్లలో వెనుకబడిన ఏ.రమేష్, ఎం.శ్రీదేవికి నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు ఉంటాయని, ప్రతీరోజు లక్ష్యాల మేరకు వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

సిలిండర్ల ఆటోను ఢీకొట్టిన లారీ



బోల్తా పడిన మట్టి టిప్పర్

కొణిజర్ల: సిలిండర్లతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఖమ్మంలోని జై గురుదత్త గ్యాస్ ఏజెన్సీకి చెందిన ట్రాలీ ఆటోలో డ్రైవర్ నాగేంద్రబాబు ఖాళీ సిలిండర్లు తీసుకుని బుధవారం కొణిజర్ల నుండి ఖమ్మం వెళ్తున్నాడు. తనికెళ్లలో ఖమ్మం వైపు నుంచి వైరా వెళ్తున్న లారీ ఢీకొట్టగా ఆటోలో ఉన్న 34 సిలిండర్లు పడిపోగా డ్రైవర్ నాగేంద్రబాబుకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్తుండడంతో వెంబడించి వైరాలో అడ్డుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూరజ్ తెలిపారు.

మట్టి డిప్పర్ బోల్తా..

ముదిగొండ: మట్టి టిప్పర్ బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ముదిగొండ నుంచి బుధవారం వల్లభి వైపు వెళ్తున్న మట్టి టిప్పర్‌ను పమ్మి క్రాస్ వద్ద మరో టిప్పర్ ఓవర్ టేక్ చేసే క్రమాన రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. వీరిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, టిప్పర్ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనాలు నిలిచి పోగా పోలీసులు జేసీబీ, క్రేన్ సాయంతో పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

యువతిపై యాసిడ్ దాడి

- ప్రేమించడం లేదని దాడి చేసిన యువకుడు

ఖమ్మంక్రైం: ప్రేమను తిరస్కరించిందనే కోపంతో యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ పోసిన ఘటన ఖమ్మంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాలు... ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లో నివాసం ఉంటున్న పేరబోయిన గణేష్ తన ఇంటి సమీపానే ఉంటూ నర్సింగ్ చదువుతున్న ఓ యువతిని ప్రేమిస్తున్నానంటూ కొంత కాలంగా వేధిస్తున్నాడు. ఆమె తిరస్కరించినా వేధింపులు ఆగకపోగా ఆమె కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు మందలించినా మార్పు రాలేదు. అంతటితో ఆగక ఈనెల 13వ తేదీన భోగి రోజు రాత్రివేళ యువతి ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా సీసాలో యాసిడ్‌తో వచ్చిన గణేష్ ఆమెపై పోశాడు. ఈ ఘటనలో ఆమె చేయి, కడుపుపై యాసిడ్ పడడంపై గాయపడగా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి మెరుగవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారని సీఐ తెలిపారు. ఘటనపై తాజాగా అందిన ఫిర్యాదుతో బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు.

రైలుకింద పడి బెంగళూరు వాసి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: బెంగళూరుకు చెందిన వ్యక్తి ఖమ్మంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాలు... బెంగళూరు బసవన్న నగర్‌కు చెందిన ఆర్.రాజన్న(59) తన కుమార్తెను ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లో నివాసముండే ప్రొఫెసర్ అశోక్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. కొంత కాలంగా రాజన్న మద్యం సేవిస్తూ తిరుగుతుండగా ఇటీవల ప్రమాదంలో ఆయన కాళ్లు విరిగాయి. ఆపై కుమార్తెకు ఆరోగ్యం బాగా లేకపోవటంతో భార్యతో కలిసి ఖమ్మం వచ్చిన ఆయన మద్యానికి బానిసవడానికి తోడు మతిస్థిమితం సరిగా లేక మంగళవారం రాత్రి చర్చి కాంపౌండ్ బ్రిడ్జి వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనలో ఆయన శరీరం ముక్కలు కావడంతో ఆయన వద్ద ఆధార్ కార్డులోని వివరాల ఆధారంగా ఆచూకీ గుర్తించి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహన్ని మార్చురీకి తరలించారు. ఇంతలోనే రాజన్న ఆచూకీ కోసం కుటుంబీకులు వెతుకుతూ వస్తుండగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియడంతో కన్నీరుమున్నీరుగా రోదించారు.

ఆర్థిక ఇబ్బందులతో హెల్త్ అసిస్టెంట్..



సత్తెనపల్లి రవికుమార్ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ఆర్థిక ఇబ్బందులు భరించలేక పురుగుల మందు తాగిన హెల్త్ అసిస్టెంట్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తుపల్లి ఎస్సై రఘు వెల్లడించిన వివరాలు... సత్తుపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన సత్తెనపల్లి రవికుమార్(47) పెనుబల్లి మండలం లంకాసాగర్ పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగడంతో ఏలూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహానికి సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం బుధవారం కుటుంబీకులకు అప్పగించారు. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉండగా మృతదేహన్ని స్వస్థలమైన తల్లాడ మండలం రామచంద్రాపురం తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, గతేడాది పెనుబల్లిలో ఓ వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణం నిలబెట్టడం ద్వారా అవార్డు సాధించిన రవికుమార్ మృతిపై పీహెచ్‌సీ వైద్యులు చింతా కిరణ్‌కుమార్, ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

వృద్ధురాలి మృతిపై అనుమానాలు

- మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

ఖమ్మంరూరల్: మండలంలోని పోలిశెట్టిగూడెంకు చెందిన గుండుమాల నాగమ్మ(75) మృతిపై అనుమానాలు వ్యక్తమవడంతో పోలీసులు ఆమె మృతదేహన్ని వెలికితీయించి పోస్ట్‌మార్టం చేయించారు. నాగమ్మకు కుమారులు వెంకటేశ్వర్లు, ముత్తయ్య ఉండగా వెంకటేశ్వర్లు వద్ద ఉంటోంది. ఆమె పేరిట ఉన్న భూమికి సంబంధించి ముత్తయ్య, ఆయన కుమారులు కిరణ్, బాలరాజుతో పాటు వెంకటేశ్వర్లు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో 17వ తేదీన నాగమ్మ మృతి చెందగా కుటుంబీకులు అంత్యక్రియలు పూర్తిచేశారు. అయితే, తల్లి మృతిపై అనుమానాలు ఉన్నాయని వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం మృతదేహన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు బృందంతో వెలికితీయించి పోస్టుమార్టం చేయించినట్లు సీఐ ఎం.రాజు వెల్లడించారు.



ఖమ్మం జట్టుతో డీఈఓ శర్మ, డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ఆరంభం

ఉమ్మడి జిల్లాల వారీగా హాజరైన బాలికల జట్లు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు హాజరయ్యాయి. పోటీలను డీఈఓ సోమశేఖరశర్మ, డీవైఎస్ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాష్ట్రంలోనే జిల్లాకు క్రీడారంగంలో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఈ పేరు నిలబెట్టేలా క్రీడాకారులు సత్తా చాటాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తితో పాటు వెంకట్రాం రెడ్డి, నరేష్, గోపాల్, ఆదర్శ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు వీరే

రాష్ట్రస్థాయి పాఠశాల క్రికెట్ టోర్నీలో తొలిరోజు ఫలితాలు ఇలా ఉన్నాయి. మెదక్ జట్టు కరీంనగర్‌పై, ఆదిలాబాద్‌పై వరంగల్, మహబూబ్‌నగర్‌పై ఖమ్మం, నల్లగొండపై కరీంనగర్, హైదరాబాద్‌పై మెదక్, ఆదిలాబాద్‌పై ఖమ్మం, వరంగల్ జట్టుపై మహబూబ్‌నగర్‌తో పాటు నల్లగొండ జట్టుపై రంగారెడ్డి జట్టు విజయం సాధించాయి.

పోలీసు ఉద్యోగుల సంక్షేమానికి కృషి



క్యాలెండర్లు ఆవిష్కరించిన సీపీ, తదితరులు

ఖమ్మంక్రైం: నిత్యం విధుల్లో నిమగ్నమైన పోలీసు ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడతానని కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీస్ ఆఫీసర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ బాధ్యులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు ఏసోబు, ఎం.వెంకటేశ్వర్లు, జానీమియా, మోహన్‌రావు, పంతులు తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన టీఎన్జీవోస్ కమిటీ

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ నూతన కమిటీ బాధ్యులు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తన వంతు సహకారం అందిస్తానని సీపీ వెల్లడించారని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, గంగవరపు బాలకృష్ణ, ఎర్రా రమేష్, కరణ్‌సింగ్, లలితకుమారి, తాళ్లూరి శ్రీకాంత్, బూస చంద్రశేఖర్, పెద్దినేని రాధాకృష్ణ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలను ఏరియా జీఎం ఎం.శాలేంరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ అవసరమని, విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని తెలిపారు. మణుగూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ మాట్లాడుతూ.. క్రీడలతో నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, లక్ష్యసాధన వంటివి అలవడుతాయని చెప్పారు. స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ మాట్లాడగా.. వాలీబాల్, ఖో-ఖో పోటీలు జరిగాయి. క్రీడల్లో కొత్తగూడెం, మధిర, మణుగూరు, డీఏఆర్ఈ, ఎస్‌బీఐటీ ఖమ్మం, సత్తుపల్లి, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులం నుంచి వెళ్లిపోయిన విద్యార్థి

బోనకల్: మధిర మండలం కృష్ణాపురం గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కానరాకుండా పోయాడు. బోనకల్ మండలం రాపల్లికి చెందిన చెల్లా కృష్ణ కుమారుడైన మహేశ్వరావు గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం కృష్ణ తన కుమారుడిని బుధవారం ఉదయం గురుకులంలో చేర్పించి వెళ్లాడు. అయితే, సాయంత్రం భోజనం సమయానికి మహేశ్వరరావు కనిపించకపోవడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసిన ఆచూకీ లేకపోవడంతో గాలిస్తున్నారు.